క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



సూర్యాపేట రోడ్డుపై పరిశీలిస్తున్న పొంగులేటి

కూసుమంచి: భారీ వర్షాలు, వరద విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం పాలేరు రిజర్వాయర్ అలుగు ఉధృతిని మంత్రి పరిశీలించి అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. పాలేరు ఏటి వాగులో కూసుమంచికి చెందిన యాకూబ్, అతని భార్య సైదాబీ గల్లంతు కాగా వివరాలను తెలుసుకున్న మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కాల్వొడ్డు ఆలయంలోకి వరద నీరు



ఆంజనేయ స్వామి ఆలయంలోకి చేరిన నీరు

ఖమ్మంగాంధీచౌక్: భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి ఆలయంలోకి చేరింది. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలోకి నీరు చేరటంతో నిత్య కార్యకలాపాలు నిలిచిపోయాయి. భక్తులు ఆలయ దర్శనం చేసుకోలేకపోయారు. అలాగే, ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చేరింది. దీంతో శనివారం రాత్రి మార్కెట్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఆదివారం మార్కెట్‌లోని షెడ్ల గుండా, సెక్యూరిటీ గేట్‌లో వరద నీరు ప్రవహించింది.

ఆహార ప్యాకెట్లు అందజేత

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహార ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందజేత

ఖమ్మంఅర్బన్: నగరంలోని నయాబజార్ సెంటర్‌లో ఉన్న హాస్టల్‌లో విద్యార్థులు తాగునీటి కోసం అల్లాడుతున్నట్లు సమాచారం అందుకున్న అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బృందం సభ్యులు ప్రత్యేకంగా ఆటోలో వాటర్ క్యాన్‌లు తీసుకెళ్లారు. వరద నీటిలోనే విద్యార్థులకు అందించారు.

108లో మహిళ ప్రసవం

నేలకొండపల్లి: 108లోనే ఓ గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కూసుమంచి మండలంలోని బోటిమీదతండాకు చెందిన గర్భిణి బి.నాగమణికి నొప్పులు రావటంతో డెలివరి కోసం ఆదివారం రాత్రి నేలకొండపల్లి సివిల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. కాగా కాన్పు చేసేందుకు పరిస్థితులు ఇబ్బందిగా మారటంతో 108లో ఖమ్మం తరలిస్తున్నారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావటంతో సిబ్బంది కాన్పు చేశారు. ఆడ శిశువు జన్మించింది. వీరిని ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మిస్టర్ బచ్చన్
శ్రీనివాస	అహో విక్రమార్క
సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాంట్ కాలనీ 2

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	20		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	46	తోటకూర	3
దొండ	26		20
పొట్లకాయ	40	గోంగూర	5
చిక్కుడు	80		20
గోరుచిక్కుడు	30	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	38	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

మేఘాల విస్ఫోటనం..

- విరామమెరుగని వర్షపు ధారలు..
- బీభత్సం సృష్టించిన వరద
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు



మోతీనగర్ ప్రాంతంలో నీట మునిగిన ఇంటి నుంచి ఈదుకుంటూ వస్తున్న వ్యక్తి



బైపాస్‌లోని బ్రిడ్జికి ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు



చైతన్యనగర్‌లో వృద్ధుడిని తీసుకొస్తున్న దృశ్యం

మేఘాలు బద్ధలై నీటి కుప్పలుగా నేలపై పడ్డాయి. వర్షం ఆగకుండా విరుచుకుపడింది. ఎంతకూ విరామం తీసుకోకుండా.. అసలు అలుపనేదే లేకుండా సుమారు 40 గంటలపాటు దంచికొట్టింది. కనీవినీ ఎరుగని రీతిలో వరద ముంచెత్తింది. దీంతో జనజీవనం చెల్లాచెదురైంది. రెండు రోజులుగా ప్రజలు ఇళ్లను దాటి బయట అడుగుపెట్టేందుకు భయకంపితులయ్యారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలోని చెరువులు, వాగులు, వంకలు.. మునుపెన్నడూ చూడని రీతిలో ఉరకలెత్తాయి. పొలాల్లోకి నీరు చేరడంతో ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇక ఖమ్మం నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగి చెరువులను తలపించాయి. నగరం నడిబొడ్డున ఉన్న 10, 11 డివిజన్లలో వరద బీభత్సం సృష్టించింది. తెల్లారేసరికి నివాసాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ఒక్కసారిగా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రఘునాథపాలెం మండలంలో బుగ్గవాగు పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

-సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: నీట మునిగిన చైతన్యనగర్ కాలనీ



ఖమ్మంఅర్బన్: 10వ డివిజన్‌లో వరదలో వ్యక్తి



కామేపల్లి: కొండారెడ్డి వరదతో మునిగిన పొలాలు



కామేపల్లి: పొన్నెకల్ బుగ్గవాగు వద్ద సీఐ, ఎస్‌ఐ



మున్నేరు వరద ప్రవాహానికి మునిగిన ప్రాంతం



వరద నీటిలో మునిగిన గణపతి విగ్రహాలు



ఖమ్మంఅర్బన్: కోయచలక-కోటపాటు కల్వర్టు వద్ద..



మోతీనగర్‌లో బిల్డింగ్‌పై ఉన్న ప్రజలు



వరద పోయేందుకు డివైడర్ తొవ్వుతున్న దృశ్యం



బొక్కలగడ్డలో ఇళ్లలోకి చేరిన మురుగునీరు



హాస్టల్ విద్యార్థులకు తాగునీరు అందిస్తున్న దృశ్యం



ఖమ్మంక్రైం: మోతీనగర్‌లో..



ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్న మోతీనగర్ వాసులు



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో నిలిచిన రైలు



వర్షంలోనూ కాలేజీకి వెళ్తున్న విద్యార్థులు



రాకాసితండా వద్ద సీపీ సునీల్‌దత్



రాకాసితండా వద్ద వృద్ధురాలిని ఎత్తుకొస్తున్న దృశ్యం



ఖమ్మంవ్యవసాయం: హోల్‌సేల్ మార్కెట్‌లో..

తిరుమలాయపాలెంలో 26.3 సెం.మీ.. జనజీవనం అస్తవ్యస్తం

తిరుమలాయపాలెం: చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా తిరుమలాయపాలెం మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు రికార్డు స్థాయిలో ఉరుములు, మెరుపులు తీవ్ర గాలిదుమారంతో 26.3 సెంటీ మీటర్ల భారీ వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు తోడవడంతో ఆకేరు, పాలేరు నదులు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో ఆదివారం తెల్లవారుజామున మండలంలోని అజ్మీరతండా పరిధిలోని రాకాసితండా ప్రజలు తేరుకునే లోపే వరదలు చుట్టుముట్టడంతో కట్టుబట్టలతో జీవాలను వదిలిపెట్టి ప్రాణాలు రక్షించుకునేందుకు కొందరు గుట్టలు ఎక్కగా మరికొందరు డాబాలపైకి చేరారు. వరద ఉధృతి పెరగడంతో తమను కాపాడాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్పందించిన మంత్రి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో పాటు మండల తహసీల్దార్ పీవీ రామకృష్ణను చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ దళాలను రప్పించారు. వర్షం తగ్గడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఆకేరు ప్రవాహంలో మరబోట్లతో గ్రామానికి చేరి డాబాలపై ఉన్న 47 మందిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. గుట్టలపై ఉన్న గ్రామస్తులందరిని ట్రాక్టర్ల ద్వారా డోర్నకల్ మండలంలోని చిలక్కోయలపాడులోని పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, ఆహారం అందించారు. రాకాసితండా వాసుల గేదెలు, పశువులు, మేకలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. రమణాతండాలో 20 మేకలు మృత్యువాత పడ్డాయి. ఆకేరు పరిధిలో సాగుచేసిన మిర్చి, వరి, పత్తి పంటలు, విద్యుత్ మోటార్లు సర్వం కోల్పోయారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ ఆకేరు ప్రాంతానికి వచ్చి గంటపాటు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మండలంలోని బీరోలు పెద్దచెరువు, హస్నాబాద్ ముత్యాలమ్మకుంట చెరువులకు గండ్లు పడ్డాయి. బీరోలు – బంధంపల్లి, జల్లేపల్లి – హైదర్‌సాయిపేట, జూపెడ – బచ్చోడు, గోల్‌తండా – పాతర్లపాడు, కేశ్వాపురం – తిప్పారెడ్డిగూడెం, హస్నాబాద్ – సుబ్లేడు, ముజాహిదిపురం – కాకరవాయి, పైనంపల్లి – జూపెడ, బచ్చోడు – హస్నాబాద్, హేలావత్‌తండా – రాజారం, పాతర్లపాడు – చంద్రుతండా గ్రామాల పరిధిలోని కల్వర్టులు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు



రాకాసితండా వద్ద వరదలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



ఆకేరు వరదలో చిక్కుకుని మృతిచెందిన మేకలు



కొక్కిరేణి-ఎర్రగడ్డ మధ్య తెగిన బీటీ రహదారి



పాలేరులో వరద పరిశీలిస్తున్న కలెక్టర్



పరిస్థితిని సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సన్యాసయ్య



పైనంపల్లిలో నీటమునిగిన పంటలు



వరద నుంచి వృద్ధురాలిని తరలిస్తున్న సుర్దేపల్లివాసులు

నేలకొండపల్లి: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. రైతుల విద్యుత్ మోటార్లు నీటిలో కొట్టుకుపోయాయి. చెరువులు, కుంటలు, వాగులు అలుగులు పడి పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని సుర్దేపల్లి, రామచంద్రాపురం, కట్టుకాచారం, పైనంపల్లి గ్రామాల్లో వందల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుర్దేపల్లి బాధితులకు సొసైటీ గోడౌన్, రామచంద్రాపురం వారికి బోదులబండ, పైనంపల్లిలో హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బ్రిడ్జిపై చిక్కి..

మండలంలోని సుర్దేపల్లి – సూర్యాపేట జిల్లాలోని అనంతగిరి మండలంలోని కిష్టాపురం గ్రామాల మధ్య ఉన్న వంతెనపై బీఎస్ఎన్ఎల్‌కు చెందిన వైర్లు ఏర్పాటు చేసేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఆరుగురు కూలీలు వచ్చారు. రెండు రోజుల నుంచి అక్కడే పనులు చేస్తున్నారు. కాగా, బ్రిడ్జికి రెండువైపులా ఉన్న గ్రామాలు నీట మునగటంతో చేసేది లేక బ్రిడ్జి పైనే లారీలో ఉన్నారు. వంతెనను తాకేందుకు ఇంకా 15 అడుగుల ఎత్తు ఉండటం వలన వారికి ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పైనంపల్లి వద్ద జాతీయ రహదారి పనులు చేసే ఇరువురు కూలీలను స్థానికులు కాపాడారు. మండలంలో వరద ప్రాంతాలను అదనపు కలెక్టర్ సన్యాసయ్య, ఎంపీడీఓ ఎర్రయ్య, ఎస్ఐ పి.సంతోష్ పర్యటించారు.

పాలేరుకు వరద పోటు..



భారీ వర్షానికి వచ్చిన వరద ఉధృతికి తెగిపోయిన పాలేరు - నర్సింహులగూడెం రహదారి

కూసుమంచి: అల్పపీడన ద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలకు పాలేరు రిజర్వాయర్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా వరద నీరు చేరింది. ఆదివారం తెల్లవారుజామున రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టాన్ని దాటి 28 అడుగులకు చేరటంతో అలుగుపారి వరదనీరు పాలేరు ఏటిలో కలుస్తోంది. రిజర్వాయర్‌కు లక్షా 65 వేల క్యూసెక్కుల వరదనీరు ఎగువ నుంచి చేరుతుండటంతో పాటు సాగర్ నుంచి మరో 6 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. లక్ష క్యూసెక్కుల మేర వరద ఏటిలోకి ప్రవహిస్తోంది. మధ్యాహ్నం వరకు 5 వేల క్యూసెక్కుల వరద తగ్గగా లక్ష క్యూసెక్కుల నీరు మాత్రం ప్రవహిస్తునే ఉంది. పాలేరు గ్రామంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, వేలాది ఎకరాలు నీటమునిగాయి.

మునిగిన హైడల్ ప్రాజెక్టు..

పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో మినీ హైడల్ ప్రాజెక్టు నిండిపోయింది. దీంతో ప్రాజెక్టులోని రెండు యూనిట్లు నీట మునిగాయి. ప్రాజెక్టు కాల్వ పొర్లి పక్కనే ఉన్న విద్యుత్ ఉప కేంద్రం మీదుగా ప్రవహించడంతోపాటు ఎడమకాల్వలో కలిసింది. దీంతో ప్రాజెక్టు కాల్వకు గతంలో ఎన్నడూ లేని విధంగా గండ్లు పడ్డాయి. పాలేరు రిజర్వాయర్ అలుగుల ద్వారా భారీగా నీరు ప్రవహిస్తుండటంతో ఇటు పాలేరు నాయకన్‌గూడెం మధ్య సూర్యాపేట రహదారిపై రాకపోకలు నిలిచిపోయి. ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై వాహనాలు ఉదయం 8 గంటల వరకు రాకపోకలు సాగించినా ఆ తరువాత వరద ఉధృతికి ఏటి వంతెన పైనుంచి నీరు రహదారిపై 5 అడుగుల మేర ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఈ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాలేరు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



మత్స్య పరిశోధనా కేంద్రంలోకి చేరిన వరదనీరు



చెరువును తలపిస్తున్న పొలాలు



మల్లాయిగూడెం వద్ద కాల్వకు పడిన గండి

ముందు ముక్క.. వాన ఓ లెక్కా..



జిహ్వాచాపల్యం ముందు ఏదైనా లెక్క కాదు. వర్షం, వరదలోనూ ఆదివారం కావడంతో మాంసం కొనేందుకు కొందరు ఆసక్తి చూపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాలువలు ఉప్పొంగి ఖమ్మం నగరంలోని లకారం చెరువు పరిసరాలకు వరద పోటెత్తుతున్నా జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఓ మాంసం విక్రయ కేంద్రం వద్ద పలువురు మాంసం కొనుగోలు చేశారు.

-ఖమ్మంవన్‌టౌన్